25

# శిష్యరక్షకుడు శ్రీశేషుదేవులు

శ్రీ గురుదేవులు సంఘమును, శిష్యులను సంపూర్ణముగా ప్రేమించుటయేగాక తన యొక్క సర్వ శక్తియుక్తులను ఉపయోగించి సంఘమును, శిష్యులను అనుక్షణము రక్షిస్తూ ఉండెడివారు. తల్లికోడి తన పిల్లలను తన రెక్కల చాటున దాచుకుని రక్షించునట్లుగ శ్రీ శేషుబాబుగారు తన రెక్కలతో శిష్యులను కప్పి రక్షించేవారు. కోడి తనపిల్లలను భక్షించడానికి వస్తే గ్రద్దనైనాసరే ఎదిరించి పోరాడి తన పిల్లలను రక్షించుకుంటుంది. అలాగే శ్రీ శేషుబాబు గారు కూడా శిష్యుల కొరకు లోకములోని ఎంత పెద్దవారితోనైనా ధైర్యముగా ఎదిరించి, మొండిగా పోరాడి తన శిష్యులను రక్షించేవారు. శ్రీ గురుదేవులు తెలియచేసిన ఒక సత్యవాక్యమును ఇక్కడ స్మరించుకుందాము. "శ్రీ ఆంజనేయస్వామి తన దేహబలము అనే బాహ్య ఆయుధమును తన పరమతండ్రియగు శ్రీరాముని రక్షించుట కొరకు బాహ్యుడైన శ్రీ రావణునిపై ప్రయోగించినారు. బాహ్యముతో బాహ్యమును ఎదిరించి పరమును రక్షించుకొనుట అనే రాజకీయములో శ్రీ ఆంజనేయస్వామియే నాకు ఆదర్శము. సంఘనాయకుడైన వ్యక్తి తనకున్న బాహ్యశక్తియుక్తులన్నింటినీ సత్యసంఘమును వ్యతిరేకించే బాహ్యులపై ప్రయోగించి సత్యసంఘమును రక్షించుకోవాలి. అట్టి రాజకీయమును నేను నా జీవితములో సంపూర్ణముగా ఆచరించియున్నాను. శ్రీ ఆంజనేయస్వామిని ఆదర్శముగా తీసుకొని నాకున్న బాహ్యశక్తియుక్తులన్నింటినీ సత్యసంఘమును రక్షించుటకై బాహ్యులపై ప్రయోగించినాను. నిజమునకు బాహ్యబలము ఎందుకూ పనికిరాదు. శ్రీరాముడిని రక్షించినది శ్రీ ఆంజనేయస్వామి యొక్క దేహబలము కాదు. శ్రీరామునిలోని సత్యశక్తియే శ్రీరాముని రక్షించినది. శ్రీరాముడు తలచుకొంటే ఒక క్షణములో సముద్రానికి వారధి కట్టేయగలరు, సముద్రమును దాటేయగలరు. శ్రీ ఆంజనేయస్వామికి సత్కర్మ చేసుకునే అవకాశము నీయుటకొరకే శ్రీరాముడట్టి కర్మ చేయలేదు. కాబట్టి సంఘ నాయకుడు తన బాహ్యబలముతో సత్యసంఘము రక్షించబడుట లేదని, పరమతండ్రియే సత్యసంఘమును రక్షించుచున్నారని, పరమతండ్రి దయతో తనకు సత్కర్మ చేసుకునే అవకాశమును ప్రసాదించుచున్నారనే సత్యమును ఖచ్చితముగా గుర్తించుకోవాలి". అని శ్రీ గురుదేవులు తెలియచేసియున్నారు.

CONTINUE...

శ్రీ గురుదేవుల శిష్యవాత్సల్యము గురించి ఇద్దరు సన్నిహిత బంధువుల మధ్య జరిగిన సంభాషణను ఇక్కడొకసారి స్మరిద్దాము. "శ్రీ శేషుగారు శిష్యుల విషయములో మనము నిజము చెప్పినా నమ్మరు. ఎవరైనా శిష్యుడు హత్య చేయుటను మనము ప్రత్యక్షముగా చూచినామనుకుందాము. మీ శిష్యుడు హత్య చేసినాడు మిమ్మల్ని కూడా ఏమైనా చేస్తాడేమో అతని విషయంలో జాగ్రత్తగా ఉండండి అని మనము ఆయనకు చెప్పినా ఆయన నమ్మరు. మనము ఎన్ని సాక్ష్యములు చూపించినా ఆయన నమ్మరు. ఆయన ఆ శిష్యుడినే పిలుస్తారు నీవు హత్య చేసావా ? నీ విషయంలో నేను జాగ్రత్తగా ఉండాలా ? అని అతడినే అడుగుతారు. ఆ శిష్యుడు అబ్బే నేను హత్య చేయలేదండి, నేను అలాంటివాడను కాను అని చెప్పాడనుకుందాము. అప్పుడు శ్రీ శేషుబాబు గారు ఆ శిష్యుడు చెప్పిన దానినే వందశాతము నమ్ముతారు. మనము నిజము చెప్పినా నమ్మరు, శిష్యుడు అబద్ధము చెప్పినా దానినే నమ్ముతారు. కనుక శ్రీ శేషుబాబు గారివద్ద శిష్యుల గురించి వ్యతిరేకముగా ఏమి చెప్పినా అది నిష్ప్రయోజనమే అవుతుంది" అని ఇరువురు బంధువులు 5-1-1997 వ తేదీన మాట్లాడుకుంటుండగా విని ఇక్కడ వ్రాసియున్నాము.

నిజానికి బ్రహ్మజ్ఞానియగు శ్రీ శేషుబాబు గారికి అందరి ఆంతర్యములు బాగుగా తెలిసియుంటాయి. ఆయన ఎవ్వరినీ గ్రుడ్డిగా నమ్ముటగానీ, మోసపోవుటగానీ ఎప్పుడూ జరుగదు. తమ బంధువులలో బాహ్య దృష్టివలన శిష్యుల యెడల సత్సంగము యెడల వ్యతిరేకతగానీ ఆటంకము కలిగించు యోచనలు గానీ రాకుండా చేయుటకే ఆయన వారి వద్ద అలాగ కనిపించేవారు. అంతిమ నిష్ఠూరము కంటే ఆది నిష్ఠూరమే మేలు అన్నట్లుగా, వ్యతిరేక ఆలోచన వచ్చినా ఏ ప్రయోజనము ఉండదనే భావము ముందుగానే వారి మనస్సులలో ముద్ర పడిపోయేలా చేసినారు. ఆయన వద్ద శిష్యుల గురించి వ్యతిరేకముగా మాట్లాడుటకు కూడా అవకాశము లేకుండా చేసినారు. ఈ విధముగా కంటికి కనురెప్ప వలె లోకము నుండి సత్యసంఘమును అనుక్షణము కాపాడుచూ ఉండెడివారు. సంసారములో ఉండి కూడా సత్యమును ప్రేమించుటకు ఇంతటి వ్యూహముతో అప్రమత్తముగా ఉన్నారు కాబట్టియే ఆయన భగవంతుడే అయిపోయినారు. సత్సంగ రక్షణలో తిరుగులేని రక్షణకోట నిర్మించిన శిష్యరక్షకుడు శ్రీ శేషుతండ్రి.



CONTINUE...

శిష్య రక్షకుడగు శ్రీ గురుదేవులు శిష్యుని రక్షించుట కొరకు ఎంతటి వారినైనా లెక్క చేసేవారు కాదు. శిష్యునికి కష్టమెదురైతే తనకెంత నష్టమైనా, రిస్క్ అయినా లెక్క చేయకుండా శిష్యునికి అండగా నిలబడి శిష్యుని తరపున పోరాడే మనస్తత్వము కలిగియుండేవారు. శిష్య ప్రేమతో శిష్యుని కొరకు ఎంత అవమానమునైనా ఎన్ని నిందలనైనా మోసేయుటకు ధైర్యముగా సిద్ధపడేవారు. సమస్యలకు భయపడి స్నేహితుడిని వదిలేసే పిరికితనము ఆయనలో అణుమాత్రమైనా లేదు.

శ్రీ శేషు గారికి తెలిసినదొక్కటే, "నీతికన్నా, ధర్మముకన్నా సత్యము గొప్పది ఎన్ని ఆటంకములెదురైనా, ఎన్ని అవమానాలెదురైనా, నీతియే ఆటంకమైనాగానీ ఏనాడూ సత్యమును వీడరాదు, సత్యమునకు ప్రతిరూపమగు సంఘమును వీడరాదు. 1972లోనే ఆయన తనదైన సమస్తాన్నీ వీడి సర్వసంగపరిత్యాగిగ తనని తాను సత్యదేవునికి సమర్పించుకున్నారు. అప్పటి నుండి ఆయన తన వ్యక్తిత్వమును విస్మరించి సత్యదేవుని ప్రతినిధిగానే లోకములో జీవించుచున్నారు. తన కర్మలన్నింటినీ శూన్యము చేసుకుని, తన ఇష్టములన్నింటినీ శూన్యము చేసుకుని సత్యదేవుడు ప్రసాదించిన సద్గురుశక్తి కర్మలనే తన కర్మలుగ ఆచరించుచున్నారు".

శ్రీ శేషుబాబుగారు శిష్యునికి అండగా ఉండి శిష్యుని రక్షిస్తూ అవమానములను, మమకారములను లెక్కచేయని మహాయోగిగ శిరస్సుపై సత్యమును ధరించి ముందుకు సాగిపోవుచునేయున్నారు. ఆ ప్రయాణమలా నిరాటంకముగా నిరంతరాయముగా కొనసాగి 22-11-1998వ తేదీన అవతారునిగ మేల్కొనుట అనే గమ్యమును చేరి తానే సత్యముగా మారిపోయినారు.

1980లో రామచంద్రపురమునందు క్రొత్త సభ్యులతో క్రొత్త సత్సంగము ఏర్పడినది. శ్రీ శేషుబాబుగారిలోని మాయాతీతమైన, మహర్షితత్వము కలిగిన ఆత్మశక్తులనే శిష్యునిలో ప్రవేశింపచేసి అనుగ్రహించేవారు. అట్టి ఆత్మశక్తుల ప్రభావము చేత సత్సంగములో ప్రవేశించిన సభ్యులందరూ మాయా సంబంధమైన తమ పాత జీవిత పద్ధతిని పూర్తిగా విడనాడి సత్యమునే అభిమానించెడివారు. గురు అనుగ్రహముతో వారి ప్రవర్తన పూర్తిగా మారిపోయి యోగులవలె, మహర్షులవలె జీవించెడివారు. వారి కుటుంబీకులు వారిలో కలిగిన అట్టి మార్పును సహించలేక శ్రీ గురుదేవులను విమర్శిస్తూ, ద్వేషిస్తూ ఉండేవారు. శిష్యులను సత్యమార్గములో నడిపించుట కొరకు ఎన్ని నిందలనైనా ఎన్ని విమర్శలనైనా సంతోషముగా స్వీకరిస్తూ, భరిస్తూ శిష్యుల ఆత్మలను శాశ్వతముగా రక్షించిన శిష్యరక్షకుడు శ్రీ శేషుబాబుగారు.

CONTINUE...

మహాభారతములోని శ్రీ కర్ణుడు తన దేహములో భాగమైన సహజ కవచకుండలములు అనే బాహ్యసంపదను కోసి దానమిచ్చినారు. అందువలన ఆయన దానకర్ణునిగా శాశ్వతముగా కీర్తింపబడినారు. శ్రీ గురుదేవులు తనలోని ఆత్మలో భాగమైయున్న ఆత్మశక్తులనే అందరికీ దానమిచ్చేస్తూ కూడా అందుకు ప్రతిగా ఎట్టి కీర్తిని పొందకపోగా అందరిచేతా విమర్శింపబడుతూ, దూషింపబడుతూ, ద్వేషింపబడుచున్నారు. ఏ వ్యక్తినైనా సత్యమార్గములోనికి మార్చుట కొరకు అనగా తనలోని ఆత్మశక్తిని వారికి దానమిచ్చుట కొరకు ఎన్ని నిందలనైనా, ఎన్ని దూషణలమైనా, ఎన్ని అవమానములనైనా భరించుటకు సంతోషముగా సంసిద్ధులైయుండే త్యాగమూర్తి శ్రీ శేషుబాబుగారు.

శిష్యుల కొరకు ఎంతటి హీనమైన అవమానాలనైనా సహించి శిష్యులను రక్షించిన కరుణామయుడు శ్రీ శేషుబాబుగారు.

ఒక నది ఒడ్డున కూర్చునియున్న ఒక సాధువుకు నదీ ప్రవాహములో కొట్టుకుపోతున్న ఒక తేలు కనిపించినది. ఆ సాధువు ప్రక్కనున్న ఒక కర్రపుల్లను తీసి నదిలోని తేలుకు అందించారు. ఆ తేలు కర్రపైన ప్రాకుకుంటూ నీటి నుండి బయటకు వచ్చి, కర్రను పట్టుకునియున్న సాధువు యొక్క చేతిమీద కాటు వేసినది. ఆ బాధకు సాధువు కర్రను వదిలేయుటతో తేలు మరల నదిలో పడిపోయినది. వెంటనే సాధువు మరల కర్ర తీసి తేలుకు అందించినారు, తేలు మరల పైకి రాగానే సాధువు చేతిని కుట్టినది. మరల సాధువు కర్ర అందీయుట చూచిన ఒక వ్యక్తి అది మిమ్మల్ని కుడుతుంది అని తెలిసి కూడా దానినెందుకు రక్షిస్తున్నారు అని అడిగినాడు. అప్పుడు సాధువు ప్రాణాపాయ సమయములో కూడా కుట్టడమనే తన స్వభావమును తేలు విడువలేదు మరి సాటి జీవులకు సేవ చేయడమనే సాధువు స్వభావాన్ని నేనెందుకు విడవాలి అని సమాధానము చెప్పినారు. అదే విధముగా ప్రేమాస్వరూపులైన శ్రీ గురుదేవులు తనను దూషించే, హింసించే చెడ్డవారిపైన కూడా ప్రేమనే చూపించినారు. ఎంతగానో తమను దూషించిన ఒక స్త్రీ యొక్క కుమారులలో ఒకడగు శ్రీనుబాబు 1991లో అల్పాయుష్షుతో మృత్యుముఖములో ఉండగా తన ఆయుష్షునే అతనికి దానమిచ్చి మృత్యువు నుండి అతనిని రక్షించి అతనికి ఇహపరాలుగా అద్భుతమైన సేవలను అనుగ్రహించిన త్యాగమూర్తి శ్రీ శేషుబాబుగారు.

continue...

శ్రీ గురుదేవులు సత్సంగ రక్షణలో అందరికంటే తానే ముందుండి తన సర్వశక్తులు ఉపయోగించి ధైర్యముగా పోరాడేవారు.

శ్రీ శేషబాబు గారు ఎల్లవేళలా మెలకువలోను, నిద్రలోను కూడా శిష్యరక్షణయందు పరిపూర్ణముగా నిమగ్నమైయుండేవారు. ఆయన తన బాహ్యబలములన్నింటిని ఉపయోగించి ఆకారముగా శిష్యులను రక్షించుటయే గాక ఆత్మశక్తిని ఉపయోగించి నిరాకారముగా కూడా సర్వవేళలా పరిపూర్ణముగా శిష్యులను రక్షిస్తూ ఉండేవారు. శ్రీ గురుదేవులు తాను చేయు సేవను, రక్షణను ఎప్పుడూ బహిర్గత పరచకుండా రహస్యముగానే ఉంచెడివారు.

ఆకారముగాను, నిరాకారముగాను శ్రీ గురుదేవులు చేసియున్న, చేయుచున్న రక్షణకర్మలు అనంతముగా ఉన్నవి.

మెలకువలోనే కాకుండా నిద్రలో కూడా శ్రీ గురుదేవులు శిష్యరక్షణలో అప్రమత్తముగానే ఉండేవారు.

శ్రీ గురుదేవులు తన శిష్యుల మీద దయ్యపుశక్తులు గానీ, పిశాచపుశక్తులుగానీ, సైతానుశక్తులు గానీ వాలకుండాను, హింసించకుండాను తన ఆత్మశక్తితో శిష్యులచుట్టూ రక్షణకోట నిర్మించి అనుక్షణము రక్షిస్తూ ఉండేవారు. శ్రీగురుదేవులు తన బాహ్యబలములన్నింటినీ ఉపయోగించి సంఘమును రక్షించుటయే గాక తన జ్ఞానశక్తితో, నిరాకారశక్తులతో, ఆత్మశక్తితో ప్రతిక్షణము శిష్యులను రక్షించేవారు. తనలోని ఆత్మశక్తులను శిష్యులకు దానమిచ్చి వారిలో సత్యఆత్మతను ప్రవేశపెట్టుట ద్వారా వారిచేత సత్యకర్మలు చేయించి వారి ఆత్మలకు శాశ్వత రక్షణను అనుగ్రహించేవారు ప్రతి శిష్యుడు తనకెదురైన ప్రతి పరిస్థితిలోను శ్రీ గురుదేవులు తనకు ప్రతిక్షణము తోడుగా ఉండి కంటికి రెప్పలా తనను కాపాడుచుండుటను ఎల్లప్పుడూ అనుభూతి చెందేవారు. శ్రీ గురుదేవులు దేహమును ధరించియున్నప్పుడే గాక దేహానంతరము కూడా తన శిష్యులను, భక్తులను ఇప్పటికీ ప్రతిక్షణము అండగా ఉండి రక్షించుచున్నారనే సత్యమును ప్రతి ఒక్కరూ అనుభూతి చెందుచునేయున్నారు. ఎంతటి క్లిష్ట పరిస్థితి ఎదురయినాసరే, నమ్మకముతో శ్రీ గురుదేవులను స్మరించగానే కష్టాలను తొలగించి పరిస్థితులన్నింటినీ మనకు అనుకూలముగా మార్చి రక్షించే అపద్బాంధవుడు శ్రీ శేషతండ్రి. శ్రీ గురుదేవులు తెలియపరచిన సత్యమార్గమును, ఆత్మవిమర్శను గ్రహించి, తమ బాధలకు కారణము తమ పాపమేనని గ్రహించి, తమ పాపములను క్షమించుటకు, తమ బాధల నుండి తప్పించుటకు శ్రీ శేషప్రభువు తప్ప తమకు మరే దిక్కూ లేదనే విశ్వాసముతో ఎవరైతే ఆయనను శరణువేడతారో వారి భారమంతా తానే మోసి, అనుక్షణము వారికి అండగా ఉండి రక్షించే అనాధరక్షకుడు శ్రీ శేషనాధుడు. ఇప్పటికి కూడా ఎవ్వరైతే శ్రీ గురుదేవులను అవతారునిగా నమ్మి ఆశ్రయిస్తారో అట్టివారికి నిరాకారమందుండి కూడా తనలోని ఆత్మశక్తులను ప్రసాదించుచూ సత్యకర్మ చేయించుట ద్వారా ఆత్మాభివృద్ధిని ప్రసాదించుచున్న ఆత్మశక్తి ప్రదాత శ్రీ శేషబాబు గారు



*****